ప్రజాశక్తి
శనివారం 21 అక్టోబర్ 2023 5 విజయనగరం



పోలీసుశాఖ ఆధ్వర్యాన నేటి నుంచి పలు కార్యక్రమాలు

విజయనగరం : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అక్టోబరు 21 నుండి 31 వరకు పలు కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లుగా ఎస్పి ఎం.దీపిక తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణంలో గల 'స్మృతి వనం'లో విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసులకు ఘనంగా నివాళులు అర్పించనున్నామ న్నారు. అనంతరం స్మృతి పరేడ్ నిర్వహించి, ర్యాలీ చేపడతామన్నారు. విద్యార్ధులకు 'లైంగిక వేధింపుల నుండి మహిళలకు, పిల్లలకు రక్షణ - సామాజిక పాత్ర' అనే అంశంపైన, పోలీసు ఉద్యోగులకు 'సోషల్ మీడియా దుర్వినియోగం మరియు సైబర్ మోసాల అరికట్టడంలో సాంకేతికత పాత్ర' అంశంపైనా వక్తత్వ మరియు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. అన్ని పోలీసు స్టేషన్ల పరిధిల్లో 26న 'ఓపెన్ హౌస్' కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. 27న 'మెడికల్ క్యాంపు', రక్తదానం పోలీసు కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తామని తెలిపారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తామని ఎస్పి తెలిపారు.

పింఛను.. ఉద్యోగుల హక్కు

- జిపిఎస్ పేరుతో రెండున్నర లక్షల మంది ఉద్యోగుల సొమ్ము గాలిలో
- ప్రభుత్వ తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

30 నుంచి 35 ఏళ్ల పాటు ప్రభుత్వ సేవలు అందించే ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రిటైర్డు అయిన తర్వాత పెన్షన్ పొందడం వారి హక్కు. వారి సేవలకు ఇచ్చే గుర్తింపు అది. అటువంటి హక్కును అమలు చేయకుండా నేడు రాష్ట్రంలో ఉద్యోగుల పెన్షన్ హక్కును కాలరాసే విధానం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఎన్నికల ముందు.. అధికారంలోకి వచ్చిన వారం రోజులో సిపిఎస్‌ను రద్దు చేస్తామని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం లోకి వచ్చి నాలుగున్నరేళ్లఅవుతున్నా సిపిఎస్‌ను రద్దు చేయకపోగా సిపి ఎస్ కంటే ప్రమాదకరమైన జిపిఎస్ విధానాన్ని తీసుకొచాచరు. దేశంలో ఆరు రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం దారుణమని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. గత నాలుగేళ్లుగా ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, సిపిఎస్ ఉద్యోగ సంఘాలు అనేక పోరాటాలు చేశాయి. యుటిఎఫ్ సైకిల్ ర్యాలీలు, బ స్సు యాత్రలు, ధర్నాలు, పాదయాత్రలు చేపట్టింది. కొంత కాలం పాటు సబ్ కమిటీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలక్షేపం చేసింది.నాలుగేళ్ల తర్వాత ఎన్నికలు సమీపిస్తుండటంతో జిపిఎస్ పేరుతో కొత్త డ్రామాకు తెరలేపింది. ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాలకు ఇష్టం లేక పోయినా బలవంతంగా జిపిఎస్‌ను తీసుకువచ్చింది. ఇది సిపి ఎస్ కంటే ప్రమాద కరంగా ఉందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

మరో వైపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు డిఎ, పిఆర్‌సి, ఎపి జి ఎల్ఐ, గ్రాట్యుటీ బకాయిలు సుమారుగా రూ.11వేల కోట్ల రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. 2022 జూలై నుంచి ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు 2003 నోటిఫికేషన్ ప్రకారం ఉద్యోగంలో చేరిన వారికి రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకుండా మరో మోసానికి తెరలేపింది. కేంద్ర ప్రభుత్వం 57 మెమో ద్వారా 2004 ముందు నోటిఫికేషన్ ప్రకారం ఉద్యోగం పొందిన వారు పాత పెన్షన్ విధానంలో వస్తారని చెప్పింది. అనేక రాష్ట్రాల్లో మెమో 57 ప్రకారం పాత పెన్షన్ పథకం అమలు చేశాయి. మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 2003 నోటిఫికేషన్ ప్రకారం ఉద్యోగం పొందిన సుమారు 11వేల మంది ఉద్యోగులకు, జిల్లాలో 600 మందికి పైగా ఉద్యోగులకు ఒపిఎస్ అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేసింది. దీంతో ఒపిఎస్ సాధన కోసం, సిపిఎస్, జిపిఎస్ రద్దు కోసం యుటిఎఫ్ నిరవధిక దీక్ష చేపట్టింది. ప్రభుత్వం స్పందించకపోతే ఈ పోరాటం దీర్ఘ కాలిక పోరాటంగా సాగనుంది.

న్యాయబద్ధంగా ఇవ్వాల్సిందే

న్యాయబద్దంగా మాకు అమలు చేయాల్సిన ఒపిఎస్, కేంద్రం ఇచ్చిన మెమో 57 అమలు కోసం, జిపిఎస్ రద్దు కోసం ఉద్యమిస్తాం. ఎటువంటి అంగీకారం తీసుకోకుండా బలవం తంగా జి పిఎస్ తీసుకు రావడం అన్యాయం. అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలి.

- రెడ్డి మోహనరావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

కుంటిసాకులు మానుకోవాలి

ప్రభుత్వం ఆర్థిక భారమని రక రకాలుగా కుంటి సాకులు చెప్పడం మానుకోవాలి. దేశంలో ఆరు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఒపిఎస్ విధానం ఇక్కడ ఎందుకు అమలు కాదు?. అమలు చేయాలనే చిత్తశుద్ది పాలకులకు లేకపోవడమే కారణం. అన్ని రాజకీయ పార్టీలు ఒపిఎస్‌కు మద్దతు పలకాలి. ఒపిఎస్ సాధించే వరకు పోరాటం ఆగదు.

- పి.రాంప్రసాద్, సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్

భద్రత లేని పెన్షన్ మాకొద్దు

ఉద్యోగుల పెన్షన్ కు భద్రత లేని జిపిఎస్ విధానం మాకొద్దు. ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని గ్యారెంటి ఉంది తప్ప ఉద్యోగుల డబ్బుకు గ్యారెంటీ లేదు. ఎంత పెన్షన్ ఇస్తారో కూడా అందులో లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఒపిఎస్ అమలు చేయాలి.

- డి.రాము, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

ఒపిఎస్ అమలు చేయకుంటే దీర్ఘకాలిక పోరాటం

జిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ పథకం అమలు చేయకుంటే దీర్ఘ కాలిక పోరాటమే శరణ్యం. చట్ట బద్దత లేని జిపిఎస్ విధానం సరికాదు. ఓట్ ఫర్ ఒపిఎస్ అనే నినాదాంతో ఒపిఎస్ సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తాం.

- కె.విజయగౌరి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

గుణపాఠం తప్పదు

జిపిఎస్ రద్దు చేయకుంటే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పక తప్పదు. శక్తి యుక్తులను ఒడ్డి సేవలు అందించిన ఉద్యోగులకు రిటైరైన తర్వాత గౌరవంగా ఇచ్చే పెన్షన్ లేకుండా చేయడం అన్యాయం. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల లో పెన్షన్ అమలు చేసి, మాకు రావాల్సిన పెన్షన్ హక్కును ఇవ్వకుండా చేయడం దుర్మార్గం.

- జెవిఆర్‌కె ఈశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

హామీని అమలు చేయాలి

మేము రాష్ట్ర ప్రభుత్వాన్ని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్ అమలు చేయాలని కోరుతున్నాం. ఓట్లు రాజకీయాలు మానుకొని ఇచ్చిన హామీ అమలు చేసి, చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. ఎంపి,ఎమ్మెల్యే లకు పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వం 30 ఏళ్లకు పైగా సేవలు అందించే ఉద్యోగాలకు పెన్షన్ లేకుండా చేయడం సరికాదు.

- జె.రమేష్ చంద్ర పట్నాయక్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు

యుటిఎఫ్ దీక్షలు భగ్నం

అరెస్టు చేసి ఆస్పత్రికి తరలించిన పోలీసులు

యుటిఎఫ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షలను పోలీసులు శుక్రవారం రాత్రి భగ్నం చేశారు. దీక్షలు రెండోరోజుకు చేరుకోవడంతో ఉదయానికే కొందరి ఆరోగ్యం క్షీణించింది. ఈనేపథ్యంలో దీక్ష చేస్తున్న 8 మంది యుటిఎఫ్ నాయకులకు ఒకటవ పట్టణ సిఐ వెంకటరావు శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ వైద్య బృందంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. రెండు రోజులుగా ఎటువంటి ఆహారమూ తీసుకోకుండా దీక్షలు చేస్తుండటంతో ఆరోగ్యాలు క్షీణించాయని, బిపి, షుగర్ లెవెల్స్ తగ్గిపోయాయని వైద్యులు తెలిపారు. దీంతో వైద్యుల సూచనలు మేరకు పోలీసులు దీక్షలో కూర్చున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.విజయగౌరి, రాష్ట్ర నాయకులు డి.రాము, కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.రమేష్ చంద్ర పట్నాయక్, జెవిఆర్‌కె ఈశ్వరరావు, తిరుపతి నాయుడు, సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్‌లను పోలీసులు బలవంతంగా లాక్కెళ్లి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్ద ఉపాధ్యాయులు, పోలీసుల మధ్య లాగులాట జరిగింది. పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు సిపిఎస్, జిపిఎస్ లను రద్దు చేయాలని, ఒపిఎస్ అమలు చేయాలని యుటిఎఫ్ నాయకులు నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గజపతినగరం : నిరవధిక దీక్షలకు మద్దతుగా గజపతినగరంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన ఒక్కరోజు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షల్లో యుటిఎఫ్ జిల్లా ట్రజరర్ చింత భాస్కర్, రాష్ట్ర కౌన్సిలర్ కిల్లాడ అప్పారావు, జిల్లా కార్యదర్శి వానపల్లి రాధాభవాని, జిల్లా సీనియర్ నాయకులు జివి రమణ, దత్తి రాజేరు ప్రధాన కార్యదర్శి టి.రమేష్, గజపతినగరం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.రమేష్, ఎల్.జగదీశ్ కూర్చున్నారు.

శృంగవరపుకోట : తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరవధిక దీక్ష చేపట్టారు. జిల్లా కార్యదర్శి జివి రమణ, జి.రాజారావు, జామి మండల అధ్యక్షులు వి.వాసుదేవరావు, కె.శాంతకుమారి, బి.రవిబాబు, కె.జగదీశ్వరి, వేపాడ మండల ప్రధాన కార్యదర్శి ఇమంది. జగదీశ్వరరావు దీక్ష చేపట్టారు. వీరికి యుటిఎఫ్ సీనియర్ నాయకులు గూనూరు వెంకట్రావు, వి.ఇ.సత్య నారాయణ, వి.ఎస్.దేముడు, పి.జి.ఎ.నాయుడు, ఎ.రాము, మద్దతు తెలిపారు.

బొబ్బిలి : సిపిఎస్ రద్దు చేసి పాదయాత్ర, ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి, యుటిఎప్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, ఎస్‌టియు జిల్లా నాయకులు జోగారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరవధిక దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు అజయ్, శశిభూషణ్, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

సిపి పరిశ్రమకు తాళాలు

కాంట్రాక్టులు రద్దు చేస్తున్నట్లు నోటీసు ● ఆందోళనలో కాంట్రాక్టర్లు, కార్మికులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని జి.చోడవరంలోగల సిపి ఆక్వా రొయ్యల మేత పరిశ్రమకు యాజమాన్యం తాత్కాలికంగా తాళాలు వేసింది. పరిశ్రమలో పని చేస్తున్న కొంతమంది కార్మికులు, యాజ మాన్యం మధ్య తలెత్తిన వివాదం చినికి చినికి గాలివానలా మారింది. పరిశ్రమను తాత్కాలికంగా మూత వేసేదిశగా తీసుకువెళ్లింది. పరిశ్రమకు రోజువారీ కూలి నిమిత్తం కార్మికులను సరఫరా చేస్తున్న ఏడుగురు కాంట్రాక్టర్‌ల ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు నోటీసు బోర్డులో పేర్కొంది. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్లు, కార్మికులు, ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

పరిశ్రమలో 270 మంది పర్మినెంటు ఉద్యోగులు, సుమారుగా 500 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. అయితే ఈనెల 18న 50 మంది ఒప్పంద కార్మికులను ఒక విభాగం నుంచి వేరే ఒక విభాగానికి మార్చడంతో వాగ్వివాదం తలెత్తింది. దాంతో బాధిత కార్మికులు పరిశ్రమలో ఆందోళన చేపట్టారు. యాజమాన్యం, కార్మికుల మధ్య చర్చలు జరిగినా ఫలితం లేకపోయింది. దీంతో యాజమాన్యం తాత్కాలికంగా పరిశ్రమను మూసేసినట్లు తెలుస్తుంది.

తాళాలు వేసిన పరిశ్రమ ఇదే

కాంట్రాక్టర్లు రద్దు చేస్తూ నోటీసు

పరిశ్రమలో కార్మికులను సరఫరా చేస్తున్న ఆర్‌కె ఎంటర్‌ప్రైజస్, బిఎస్ఎన్ ఎంటర్‌ప్రైజస్, ఎస్-ఎస్‌బి కనస్ట్రక్షన్స్, శ్రీ సంతోషి మ్యాన్‌పవర్ కాంట్రాక్టర్, కె. కూర్మారావు కాంట్రాక్ట్, ఎన్. అప్పన్న కాంట్రాక్ట్, శ్రీ సాయిరామ్ ఎంటర్‌ప్రైజస్, కొత్తకోట శ్రీరాములు కాంట్రాక్ట్ రద్దు చేస్తూ నోటీసు బోర్డులో ప్రకటించింది. దాంతో పాటు పరిశ్రమలో సెప్టెంబర్ ఒకటో తేది నుండి ముడి సురుకు తగ్గడంతో సీడ్ ఉత్పత్తి నిలిపివేసినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికుల్లో అశాంతి నెలకొని కార్మికులు హింసాత్మకంగా మారి పరిశ్రమకు అపార నష్టం కలగజేసారని, దాంతో ఈ నెల 20 వ తేది నుండి కాంట్రాక్టలను రద్దు చేస్తున్నామని నోటీసులో పేర్కొన్నారు. ఈ కార్మికులకు ఎవరికీ పరిశ్రమలోనికి ప్రవేశం లేదని నోటీసులో పేర్కొన్నారు.

పరిశ్రమలో బౌన్సర్లతో కాపలా

కాంట్రాక్టులు రద్దు చేసిన నేపథ్యంలో పరిశ్రమలో ఉన్న తాయ్‌లాండ్ యాజమాన్యానికి రక్షణగా బౌన్సర్లను ఏర్పాటు చేసుకున్నారు. యాజమాన్యానికి ఎటువంటి హాని కలగకుండా రక్షణ కవచం ఏర్పాటు చేసినట్లు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు.

నీటి వినియోగంపై అవగాహన

వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, జలాశయాల్లో ఉన్న నీటిని సక్రమంగా వినియోగించు కోనేలా రైతులకు అవగాహన కలిగించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు అధికారులకు సూచించారు. పరిస్థితులను ఏ రోజు కారోజు అంచనా వేస్తూ రైతుకు తగు సూచనలను అందించాలని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వర రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని జలాశయాల్లో నీటి నిల్వల పరిస్థితిపై ఆరా తీసారు. తోటపల్లి నుండి ఈ ఏడాది 55 వేల ఎకరాలకు నీరందించాలని లక్ష్యం కాగా ఇప్పటికే 45 ఎకరాల వరకు అందించామన్నారు. శివారు భూములకు నీరు సరఫరా కావడం లేదని, అయితే వచ్చే రెండు మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున కొంత ఆశావహ పరిస్థితి నెలకొందని ఇఇ రామచంద్ర రావు వివరించారు. తాటిపూడి, ఆంధ్ర, మడ్డువలస, పెద్దగెడ్డ, వెంగళరాయ సాగర్ లలో ప్రస్తుతం నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయని, జలవనరుల శాఖ ఇంజినీర్లు తెలిపారు. జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ నీటి సమస్య ను ఎలా అధిగమించగలమని సైంటిస్ట్ లను అడిగారు. నీటి సమస్య ఉన్న చోట్ల పొటాషియం నైట్రేట్ స్ప్రే చేస్తే వారం రోజుల పాటు పంట లైవ్ గా ఉంటుందని తెలిపారు. పంట కోతకు వచ్చే వరకు వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని అంచనా వేయాలని, ఖచ్చితమైన ఎన్యుమరేషన్ జరపాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. లక్కిడాం ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థకు గత ఏడాది కొనుగోలుకు సంబంధించి హమాలీ ఛార్జీలు వెంటనే చెల్లించాలని డిఎస్ఒకు సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా 26 మండలాల్లో ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం అనుమతిచ్చిందని, 570 ఎకరాల్లో పంట వేయడానికి గుర్తించారని, ప్రభుత్వం నుండి 100 శాతం సబ్సిడీ రైతుకు లభిస్తుందని, అంతే కాకుండా ఇంటర్ క్రాప్ కు కూడా సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. అనంతరం ఏరువాక కేంద్రం ద్వారా ముద్రించిన ప్రస్తుతమున్న వర్షాభావ పరిస్థితుల్లో వరి, ఇతర పంటల్లో యాజమాన్య చర్యలు అనే కర పత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామా రావు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మీనా కుమారి పాల్గొన్నారు.

కెవికె నిర్మాణం ఆపకుంటే

రాష్ట్ర స్థాయి ఉద్యమం

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-దత్తిరాజేరు

చిన్నచామలాపల్లి కొండపై ప్రభుత్వం ప్రతిపాదించిన కృషి విజ్ఞాన కేంద్రం నిర్మాణం వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రస్థాయి ఉద్యమం చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం పెదమానాపురం సంతతోటలో ఏర్పాటు వేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ గ్రామంలో నివశిస్తున్న 150 కుటుంబాలకు 50 ఎకరాల విస్తీర్ణంలోని కొండ మాత్రమే జీవనాధారమని తెలిపారు. ఈ కొండపై నిర్మాణం చేపడితే గ్రామస్తులతోపాటు మూగజీవాలపైనా దాడి చేసినట్లేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 559/1996 చట్టం ప్రకారం గొర్రెలు, మేకల పెంపకందారులు నివాసం ఉన్నచోట ఖాళీ భూములు ఉంటే వాటికి వారే హక్కుదారులని స్పష్టంచేశారు. నెల క్రితం గ్రామస్తులతో వెళ్లి జిల్లా కలెక్టరుకు అక్కడ భౌగోళిక పరిస్థితులు వివరించామని చెప్పారు. స్పందించిన అధికారులు కృషి విజ్ఞాన కేంద్రం నిర్మాణంపై పునరాలోచన చేస్తామని చెప్పి నాలుగు రోజుల క్రితం ఆర్‌డిఒను పంపించి భూసేకరణ పనులు ముమ్మరం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాప్రాయ సేకరణ పెట్టి సభ ద్వారా 70 శాతం ప్రజల ఆమోదం ఉంటేనే భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఇలాంటి విజ్ఞాన కేంద్రాలు, ఫ్యాక్టరీలు పేరిట రైతుల వద్ద నుంచి దౌర్జన్యంగా భూములు లాక్కొని ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా వదిలేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని తెలిపారు. 2007లో బొడ్డవరం దగ్గర కొన్ని భూములు ప్రభుత్వం లాక్కొందని, ఇప్పటికీ అలాగే ఉండిపోయాయని ఉదహరించారు. కెవికె నిర్మాణం ఉపసంహరించుకోకపోతే నవంబర్ రెండో తేది నుంచి ఇంగిలాపల్లి సచివాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వం ముందుకు వెళితే అన్ని జిల్లాల నుంచి పెంపకందారులను కదిలించి రాష్ట్రస్థాయి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జి శ్రీనివాసరావు, పెంపకందారుల సంఘం నాయకులు మన్యాల ఎరుకునాయుడు, జి.తిరుపతి పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని, వ్యకాస నాయకులు శ్రీనివాసరావు, తదితరులు

అందరి సహకారంతో పైడితల్లమ్మ జాతర

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అందరి సమన్వయంతో పైడితల్లి అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతం కన్నా మరింత వైభవంగా సిరిమాను సంబరాన్ని నిర్వహించేందుకు అధికారులతో పాటు పాలకమండలి సభ్యులు ప్రజలు సహకరించాలని కోరారు. సిరిమాను నిర్ణీత సమయానికి చదురు గుడికి వచ్చే విధంగా చూడాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అమ్మవారి దర్శనం జరగాలన్నారు.

సమావేశం అనంతరం కమిషనర్ ఆర్ శ్రీరాముల నాయుడు మీడియాతో మాట్లాడుతూ పండగకు సకల ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 400 మంది అదనపు పారిశుధ్య కార్మికులతో ఎప్పటికప్పుడు మెరుగైన పారిశుధ్య విధానాన్ని అవలంభిస్తున్నా మని చెప్పారు. నగరంలో దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన ఫ్లెక్స్ బోర్డులు మినహా మిగిలినవి తొలగిస్తున్నట్లు చెప్పారు. 25 కేంద్రాలలో తాగునీటి సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 18 చోట్ల పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగరంలోని ప్రధాన జంక్షన్లో విద్యుత్ కాంతులతో అలంకరించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, ఆర్‌డిఒ సూర్యకళ, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, టౌన్ డిఎస్‌పి గోవిందరావు, ట్రాఫిక్ డిఎస్‌పి విశ్వనాథ్, పైడితలమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, తహసిల్దార్ శ్రీనివాసరావుతదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

నగరంలోని బుంగవీధిలో వైజాగ్ ఆల్ఫా రౌండ్ టేబుల్ ఆధ్వర్యంలో నిర్మించిన తరగతి గదులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్, జి ఆర్ ఇన్ఫ్రాకన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక సౌజన్యంతో రెండు తరగతి గదులను నిర్మించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ రేగాన రూపాదేవి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, రౌండ్ టేబుల్ చైర్మన్ రవివర్మ, భువన్, జోనల్ ఇంఛార్జి గుజ్జల నారాయణరావు, కార్పొరేటర్ అల్లు చాణిక్య తదితరులు పాల్గొన్నారు.

జెఎఎస్ పరిశీలన

లంకాపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ పొట్నూరు శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతర పాట విడుదల

పైడిమాంబ ఉత్సవాల సందర్భంగా యాగంటి రవి, రచన గానం స్వరకల్పన చేసిన 'అమ్మ జాతర చూద్దామా-జన్మ ధన్యం చేద్దామా' పాటను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి విడుదల చేశారు. 16వ వార్డు కార్పొరేటర్ గుజ్జల నారాయణరావు ఈ పాటను ఉత్తరాంధ్ర తదితర ప్రాంతాల భక్తులకు సమర్పణ చేసారు. నారాయణరావు మాట్లాడుతూ తమ డివిజన్ నుండి జాతరలో పాల్గొనే బెస్త వారి వల చారిత్రక ప్రాశస్త్యాన్ని సంతరించుకుందన్నారు. యాగంటిరవి మాట్లాడుతూ ఈ పాట విడుదల తన పదేళ్ళ కృషి ఫలితమని తెలిపారు.

జాతరకు ప్రత్యేక బస్సులు

విజయనగరం కోట : ఉత్తరాంధ్రుల ఇల వేల్పు పైడితల్లి అమ్మవారి పండగ దృష్ట్యా విజయనగరం, మన్యం,శ్రీకాకుళం జిల్లాల నుంచి ప్రత్యేకంగా వంద బస్సులు తిప్పనున్నట్లు ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ఛార్జీతో నడిచే ఈ ప్రత్యేక బస్‌ల సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు మంత్రుల రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున శనివారం జిల్లాకు రానున్నారు. ఆరోజు తెల్లవారు ఝామున నగరానికి చేరుకొని ఉదయం 10 గంటలకు రెవెన్యూ కళ్యాణ మండపంలో బస్సు యాత్ర సన్నాహక సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం బయలుదేరి వెళ్లనున్నారు. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం జిల్లాకు వచ్చారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎల్.కోటలో జరిగే నియోజకవర్గ స్థాయి బస్సు యాత్ర సన్నాహక సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎల్. కోట నుంచి విశాఖ బయలుదేరి వెళ్లనున్నారు.

కాలుష్యం బారి నుంచి కాపాడాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

గ్రామస్తులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-వేపాడ

కాలుష్యం బారి నుంచి రామస్వామిపేట గ్రామస్తులను కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రామస్వామిపేటలో శుక్రవారం పర్యటించి, గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. క్వారీలు, క్రషర్ల వల్ల వచ్చే దుమ్ము, ధూళితో గుండె, ఊపిరితిత్తులు పాడైపోయి అనేకమంది మరణించారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. తాగునీరు కూడా కలుషితం అవుతోందన్నారు. అనంతరం దడాల సుబ్బారావు మాట్లాడుతూ గ్రామస్తులంతా ఐక్యంగా అడ్డుకోవాలని, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రామస్తుల పోరాటానికి అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.అప్పారావు, ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జగన్, నాయకులు సిల్ల కృష్ణ, యనమల రమణ, సిల్ల యర్రయ్యమ్మ, పత్రి చిన్నలక్ష్మి, తమనాన గౌరి, వారధి వెంకట లక్ష్మి, టోనంగి సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన షాపులను పరిశీలిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన

సుందరీకరణ పేరుతో పొట్టకొట్టడం దుర్మార్గం

ప్రజాశక్తి-బొబ్బిలి

సుందరీకరణ పేరుతో చిరు వ్యాపారుల పొట్టకొట్టడం దుర్మార్గమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. పట్టణంలోని అమ్మవారికోనేరుగట్టు వద్ద సుందరీకరణ పేరుతో తొలగించిన షాపులను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని అభివృద్ధి చేయడం, సుందరీకరణ చేయడం మంచిదే అయినా రోడ్డుకు అడ్డంగా లేని షాపులను తొలగించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎన్నో ఏళ్ల నుంచి వ్యాపారం చేసుకుని జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారులను రోడ్డుపైకి నెట్టివేయడం అన్యాయమన్నారు. వైసిపి నేతలు చిరు వ్యాపారులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతో కౌన్సిలర్ రాంబార్కి శరత్, టిడిపి నాయకులు ఉన్నారు.

తెగుళ్లపై అప్రమత్తం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రైతులు తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఎఒ ఎం.పూర్ణిమ సూచించారు. శుక్రవారం మండలంలోని చంద్రంపేట, బెక్కలి, బూరాడపేట, పారసాం గ్రామాల్లో ఎఒ పర్యటించారు. ఈ సందర్భంగా ఎఒ పూర్ణిమ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల తెగుళ్ళ వ్యాపించే అవకాశం ఉందని తెలిపారు. ఇటువంటి వరి పొలంలో మల్టీప (13-0-45)ఎ 2 కిలోలు ఎకరాకు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కొన్నిచోట్ల పాముపొడ తెగులు, దోమపోటు గుర్తించామన్నారు. పాముపొడ తెగులు నివారణకు హెక్జా కొంజోల్ ఎ400 మిల్లీలీటర్లు ఎకరాకు, దోమపోటు నివారణకు ఆసిఫేట్ ఎ300 గ్రాములు ఎకరాకు పాయలు తీసి మొదల్లు తడిసేలా పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ హేమామహేష్, విఎఎ వేణు, బెక్కలి సర్పంచ్ నేతేటి స్వామినాయుడు, రైతులు పాల్గొన్నారు.

పురుగుల నివారణకు బ్రహ్మాస్త్రం

ప్రజాశక్తి-బాడంగి

పురుగుల నివారణకు బ్రహ్మాస్త్రం ఉపయోగ పడుతుందని ఎఒ సన్యాసినాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలోని తెంటువలసలో సామూహికంగా బ్రహ్మాస్త్రం తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలో పచ్చపురుగు, గొంగళి పురుగు, కాయతొలుచు పురుగుపై సమర్థవంతంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి ఆర్.రమణ, విసిఆర్‌పిలు టి.హైమ, భారతి, ఎం.ఉష, సత్యనారాయణ పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో తృతీయస్థానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తిరుపతిలో ఈనెల 14 నుంచి 16వరకు జరిగి. ఇంటర్ సర్కిల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యుత్తు ఉద్యోగులు తృతీయస్థానంలో నిలిచారు. ఓపెన్ సింగిల్స్ విభాగంలో పి.పైడిరాజు తృతీయ స్థానం సాధించగా, టీమ్ ఈవెంట్ విభాగంలో నాల్గవ స్థానంలో నిలిచింది. వీరిని స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ. పూడి హరి అభినందించారు.

మున్సిపల్ కార్మికులకు యూనిఫాం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి యూనిఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ ఎప్పటిలాగానే 717 మంది మహిళా, పురుషుల కార్మికులకు దుస్తులు పంపిణీ చేసామన్నారు. అనంతరం రెండు వాటర్ ట్యాంకులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆర్ శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, ఇంచార్జి ఇఇ దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తయారీలో జాగ్రత్తలు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

భూ రికార్డుల తయారీలో రెవెన్యూ సిబ్బంది జాగ్రత్తలు వహించాలని తహశీల్దార్ డి.రాజేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని ఎ.వెలగవలస రెవెన్యూ పరిధిలో చేపడుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ఖాతాల ప్రభుత్వ భూములను రికార్డుల ప్రకారం స్పష్టంగా, కచ్చితంగా కొలతలు తీసుకోవాలన్నారు. రైతుల సమక్షంలోనే వారి పొలాలను కొలతలు తీసుకోవాలన్నారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయు ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో నిరసన చేపట్టారు. ఎన్ఎంయు జోనల్ కమిటీ పిలుపుమేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డిపో సెక్రటరీ ఎ.రాజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సత్యం, జోనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ జి.ఎస్.రాజు, గ్యారేజీ సెక్రెటరీ కె.ఆనంద్, జాయింట్ సెక్రెటరీ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డిగ్రీ విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. స్టడీ మెటీరియల్‌ను మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, కళాశాల వ్యవస్థాపకులు రౌతు రామమూర్తి, కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ కనబరిచేందుకు స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పట్టుదలతో విద్యార్థులు చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెడ్డి మోహన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చేతిబోరు ప్రారంభం

బొబ్బిలి : పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ చేతిపంపు బోరును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ప్రజలు తాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నారని చెప్పడంతో తాగునీటి బోరు ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో సంపూర్ణంగా తాగునీరు అందించేందుకు పైపులైన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాబు, వైసిపి నాయకులు బబ్జా, రమేష్ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలు రవాణా చేస్తే చర్యలు

బొబ్బిలి : మాదకద్రవ్యాలు రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సిఐ ఆర్.జైభీమ్ చెప్పారు. పట్టణంలోని శుక్రవారం ఒడిశా నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు వినియోగంతో యువత జీవితాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన సేవలు

శృంగవరపుకోట.. జెఎఎస్ శిబిరంలో చిన్నారితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు కోరారు. శుక్రవారం మండలంలోని ఒమ్మి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల ఆరోగ్య పరిస్థితులను, వారికి చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి అంబల్ల సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబల్ల శ్రీరాములు నాయుడు, మండల అధ్యక్షులు చనుమల్లు వెంకట రమణ, వైస్ ఎంపిపిలు సారిక వైకుంఠం నాయుడు, పతివాడ సత్యనారాయణ, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాస్ రావు, ఎంపిడిఒ గిడుతూరి రామారావు, తహశీల్దార్ డి.ధర్మరాజు పాల్గొన్నారు. శిబిరంలో 526 మందికి వైద్య సేవలు అందించినట్లు సతివాడ పిహెచ్‌సి వైద్యాధికారి బి.సాయి నందిని తెలిపారు.

కొత్తవలస : చింతలపాలెం సచివాలయంలో జగనన్నఆరోగ్య సురక్ష శిబిరంలో 356 మందికి తనిఖీలు చేసినట్లు వైద్యాధికారి సీతల్ వర్మ, సీతామహాలక్ష్మి తెలిపారు. మాజీ సర్పంచ్ భీష్మ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సందర్శించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఇఒపిఆర్‌డి ధర్మారావు, సెక్రటరీ ఎల్. చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

వంగర : పేద ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని మగ్గూరులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని వైద్యులు అందిస్తున్న ఆరోగ్య సేవలను పరిశీలించారు. అనంతరం ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ బిపి తనిఖీ చేయించుకున్నారు. అనంతరం ఆయన రోగులతో మాట్లాడి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, తహశీల్దార్ డి.ఐజాక్, వైసిపి నాయకులు కరణం సుదర్శనరావు, పోలిరెడ్డి రమేష్, బొక్కేల వెంకట అప్పలనాయుడు, గేదెల రామకృష్ణ, కనగల పారినాయుడు, కాబోతుల శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి : పట్టణంలోని తారకరామ కాలనీ, పాకీవీధిలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ లిసావు వెంకట మురళీకష్ణ రావు సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, 30వ వార్డ్ కౌన్సిలర్ వాడపల్లి వనజా కుమారీ, 31 వ వార్డు కౌన్సిలర్ చోడిగింజల అనసూయమ్మ, రాజ్ గోపాల్

నెల్లిమర్ల.. వైద్య కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు



వంగర.. వైద్య కిట్లు అందజేస్తున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు

నాయుడు, సచివాలయ కన్వీనర్లు, డాక్టర్ శశిభూషణరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని వీలుపర్తి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. సర్పంచ్ సేనాపతి లీల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఎంపిపి డి.సత్యవంతుడు సందర్శించారు. వైద్యులు కె.రాజు, అజయ్, ఉదయ్ కుమార్, జ్యోతి సేవలందించారు. సిహెచ్‌ఒ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఆరోగ్య ఆంధ్ర నిర్మాణమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని దారపర్తి సచివాలయ పరిధిలో దబ్బగుంట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు సందర్శించారు. ఈ సందర్భంగా సేవలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఐసిడిఎస్ సంపూర్ణ పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. అనంతరం వైద్యులకు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, మాజీ సర్పంచులు ఎర్రయ్య, బుచ్చయ్య, నాయకులు మురళీరాజు, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఇఒ లక్ష్మి పాల్గొన్నారు.

వైద్యాధికారి ధరణిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు ; సమావేశంలో నిలదీస్తున్న బానాది ఎంపిటిసి గొంప తులసి

స్వపక్షంలో విపక్షం

ఎంపిపి తీరుపై అధికార పార్టీ సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో అధికార పార్టీ సభ్యులు అసంతృప్తి గళం వినిపించారు. మండల సమావేశంలో ఎంపిపి తీరును తప్పుబట్టారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి డి.సత్యవంతుడు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరయ్యారు. మండల పరిషత్తు నిధులు మంజూరులో ఎంపిపి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని టిడిపి బానాది ఎంపిటిసి గొంప తులసి, వైసిపి ఎంపిటిసి వి.వి.చినరామునాయుడుతోపాటు పలువురు సర్పంచులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బానాది, ఎన్‌కెఆర్‌పురం గ్రామాలకు రెండేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా నిరంకుశత్వంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. కనీసం మర్యాద కూడా ఇవ్వకుండా వ్యవహరిస్తున్నట్లు జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు అసహనం వ్యక్తం చేశారు. బానాదిలో టిడిపి శ్రేణులున్న వీధులకు నీరివ్వకుండా అధికారులను బెదిరించడం ఎంతవరకు సమంజసమని గొంప తులసి నిలదీశారు. ఎంపిపి తీరువల్ల మండలంలో పార్టీకి నష్టం తప్పదని అధికార పార్టీ సభ్యులు సమావేశంలోనే అసంతృప్తి వెలిబుచ్చారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో విస్తృతంగా సేవలందించిన వైద్యాధికారి ఎ.ధరణిని సభ్యులు సన్మానించారు.

సమావేశంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సన్యాసినాయుడు, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఇఒపిఆర్‌డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు ఎన్.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

సమావేశంలో నిరసన తెలుపుతున్న టిడిపి సభ్యులు

సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకని సభ్యులు అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో వైస్ ఎంపిపి ఎ.శంకర్రావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగరాయపురం ఎంపిటిసి సభ్యులు నారాయణరావు మండలంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ శాఖకు సంబంధించి శివడవలస గ్రామానికి జెఎల్‌ఎంను నియమించాలని, స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎన్ని సమావేశాల్లో చెప్పినా ఇప్పటికీ చర్యలు లేవన్నారు. మెట్టవలస సర్పంచ్ పి.మాధవ మాట్లాడుతూ రైతుల పొలాల్లోనుంచి వారి అనుమతి లేకుండా విద్యుత్ సిబ్బంది స్తంభాలు ఏర్పాటు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ గ్రామానికి చెందిన పేదలు సాగుచేస్తున్న 15 ఎకరాల అసైన్డ్ భూమిని బొబ్బిలి జగనన్న కాలనీకి తీసుకున్నారని, వారికి కాలనీలో స్థలాలు ఇప్పించాలని గత సమావేశాల్లో అడిగినా అధికారులు స్పందించక పోవడం అన్యాయమన్నారు. రీసర్వేలో తప్పులు జరుగుతున్నాయని దిబ్బగుడ్డివలస ఎంపిటిసి నాగరాజు సభ ముందుకు తీసుకువచ్చారు. ఎం.బూర్జివలస సర్పంచ్ ఈశ్వరరావు మాట్లాడుతూ గున్నతోటవలస రెవెన్యూలో భూ కబ్జాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని నిలదీశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రవి కుమార్, వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్, జెడ్‌పిటిసి శాంతకుమారి, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, డిటి గౌరీశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సభ్యులు వాకౌట్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా ఆ పార్టీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ముఖ్యమంత్రి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

జెఎన్‌టియు అనుబంధ కళాశాలలకు

స్వయం ప్రతిపత్తి హోదా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ధ్రువపత్రాలను అందజేస్తున్న విసి వెంకట సుబ్బయ్య

స్థానిక జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం గురజాడ విజయనగరం అనుబంధ కళాశాలలైన డాడీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అనకాపల్లి), విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ (దువ్వాడ) కళాశాలలకు యుజిసి స్వయం ప్రతిపత్తి హోదా లభించింది. ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాలను జె ఎన్ టి యు ఉపకులపతి ప్రొఫెసర్ కె. వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయ సుమ ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు అందజేశారు. జెఎన్‌టియు జివి అనుబంధ కళాశాలలైన మిరాకిల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అండ్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ (భోగాపురం), విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్ (దువ్వాడ) కళాశాలలకు మూడేళ్ల శాశ్వత ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అకాడమిక్ అండ్ ఆడిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్. రాజేశ్వరరావు ,ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు.

'పసలేని కేసులు పెట్టి వేధిస్తున్నారు'

ప్రజాశకి-విజయనగరం కోట

విజయనగరంకోట.. ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

చంద్రబాబు నాయుడు పై పసలేని కేసులు పెట్టి వేధిస్తున్నారని టిడిపి నాయకులు మండిపడ్డారు. శుక్రవారం బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా నగరంలోని స్టేట్‌బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ నుండి కన్యకా పరమేశ్వరి కోవెల వరకు బాబుతో నేను కరపత్రాలు పంచుతూ ప్రతి ఒక్కరిని ఒక మిస్డ్ కాల్ ఇచ్చి సపోర్ట్ చేయమని కోరారు. 73ఏళ్ల వయసు కలిగిన చంద్రబాబును ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో ప్రజలంతా చంద్రబాబుకు మద్దతుఎ పలకాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యాలయ కార్యదర్శి వర్మ రాజు, కోండ్రు శ్రీనివాసరావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మండలంలోని ఒమ్మి గ్రామంలో టిడిపి ఆధ్వర్యాన 'బాబుతో నేను' కార్యక్రమం శుక్రవారం రాత్రి జరిగింది. మండల టిడిపి అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజక వర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు పై కర పత్రాలు పంపిణీ చేసి రచ్చ బండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలోజిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, నాయకులు ఆల్తి నల్లి బాబు, దన్నాన రామ్మూర్తి, రెడ్డి నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే బిజీబిజీ



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-జామి

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో శుక్రవారం బిజీబిజీగా గడిపారు. మండలంలోని చింతాడ, కలగడ సచివాలయాల పరిధిలో సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. వైద్యుల్ని, సిబ్బందిని కలిసి ఇప్పటివరకు ఎంతమందికి పరీక్షలు చేశారని అడిగి తెలుసుకున్నారు. చింతాడ సర్పంచ్ సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు పెద్దఎత్తున గ్రామాల అభివృద్ధి చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిసిసి చైర్‌పర్సన్ స్వాతిరాణి, వైసిపి మండల అధ్యక్షులు గొర్లె రవికుమార్, జెడ్‌పిటిసి గొర్లె సరయు, ఎంపిపి సబ్బవరపు అరుణ, సర్పంచులు బాదిరెడ్డి సత్యవతి, బి.వెంకటప్పారావు, వసి పార్వతి, జ్యోతి, సూరిబాబు, ఎంపిటిసిలు చొక్కాకుల రమణ, నరసింహనాయుడు, ఎస్.నాగేశ్వరరావు, నాయకులు లగుడు సూర్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు బాదిరెడ్డి రమేష్, ఎల్లపు సూర్యనారాయణ, బంగారునాయుడు, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి సీరెడ్డి చంద్రునాయుడు, డిసిసిబి డైరెక్టర్ పాంద్రంగి సంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల అప్పగించాలని వినతి

ప్రజాశక్తి-భోగాపురం

తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బంగార్రాజు

మండలంలోని చెరుకుపల్లిలో 2019లో 122 మంది పేదలకు పట్టాలను ఇచ్చినా స్థలాలు అప్పజెప్పలేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ తహశీల్దార్ బంగార్రాజుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 1లో సుమారు 122 మందికి అప్పటి తహశీల్దారు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని గుర్తుచేశారు. స్థలాల కోసం పలుమార్లు విన్నవించుకున్నా చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై కొంతమంది న్యాయస్థానానికి వెళ్లగా, పట్టాలు అప్పగించాలని కోర్టు ఆదేశించిందని తెలిపారు. దీంతో కొంతమందికి ఇచ్చి, మిగతా వారికి స్థలాలు చూపలేదని అన్నారు. ప్రభుత్వం తమకు నచ్చిన వారికి పట్టాలు మంజూరు చేసి, ఉద్దేశపూర్వకంగా పేదలకు ఇల్లు లేకుండా చేస్తున్నారని అన్నారు. పేదలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు సరగడ తోగులురెడ్డి, పార్టీ నాయకులు తుపాకుల గురుమూర్తి, తాటిపూడి ఉదయ్ కుమార్, రిక్కా నరసింహులు పాల్గొన్నారు.

క్రేన్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-భోగాపురం

ఘటనా స్థలంలో సూర్యనారాయణ మృతదేహం

మండలంలోని ముంజేరు పంచాయతీ పిట్టపేట గ్రామానికి చెందిన పిట్ట సూర్యనారాయణ (56) క్రేన్ ఢీకొని శుక్రవారం మృతి చెందాడు. ఎస్ఐ కృష్ణమూర్తి కథనం ప్రకారం.. ముంజేరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పరీక్షలు చేసుకునేందుకు సూర్యనారాయణ సైకిల్‌పై బయలుదేరి వెళ్లాడు. ఇంతలో పిట్టపేట జంక్షన్ వద్ద ముక్కాం వైపు నుంచి భోగాపురం వెళుతున్న క్రేన్ ఢీకొట్టింది. దీంతో సూర్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. సూర్యనారాయణకు భార్య వెంకటలక్ష్మితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేరాలు ఘోరాలు

నాటు సారాతో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- వంగర

మండలంలోని వివిఆర్ పేటలో నాటు సారా విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు రాజాం ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ బి. శ్రీధర్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడుల్లో అదే గ్రామానికి చెందిన బొమ్మాలి జ్ఞానేష్, రాగోలు సురేష్ నుంచి 60 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సిఐ శ్రీధర్ తెలిపారు. ఈ దాడుల్లో సిఐ శ్రీధర్ తోపాటు ఎస్ఐ ఎస్.పిచ్చేశ్వరరావు, ఎం. శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ

ప్రజాశక్తి-భోగాపురం



చెక్కు అందజేస్తున్న సర్పంచ్ శివారెడ్డి

మండలంలోని ఎ.రావివలస పంచాయతీలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు రుణాలను శుక్రవారం అందజేశారు. గ్రామ సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి చేతుల మీదుగా 17 గ్రూపులకు సుమారు రూ.1.60 కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ప్రతి నెలా సక్రమంగా తిరిగి చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శంకర్ సాహు, ఫీల్డ్ ఆఫీసర్ హబీబ్, సిసి దుర్గా ప్రసాద్, కార్యదర్శి స్వర్ణ, ఉప సర్పంచ్ నడుపూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.